https://teluguislam.net



# 19- చేతబడి మరియు ఇంద్రజాలం వాస్తవికత

చేతబడి చేయువారిని మాంత్రికులు మరియు ఇంద్రజాలికులు అంటారు.

**అరబీలో చేతబడిని ''సిహ్ర్''** అంటారు.

మరియు **మాంత్రికుడిని ''సాహిర్''** అంటారు.

మన సమాజంలో హేతువాదులు, దైవాన్ని, విశ్వసించనివారు, షైతానుల ఉనికిని తిరస్కరిస్తారు. మరియు శాస్త్రవేత్తలు చేతబడి లేదని నమ్ముతారు. మరియు వారు చేతబడి ప్రభావాన్ని మూఢ నమ్మకాలుగా వాదిస్తారు.

వాస్తవం ఏమంటే? చేతబడి ప్రభావాన్ని ప్రాచీన కాలం నుండి ప్రజలు ఎదుర్కుంటున్నారు. అనేక మంది ప్రజలు దాని వలన నష్టాలకు గురికాబడుతున్నారు. అలా ప్రభావితులైనవారిని మన సమాజంలో అనేక మంది ప్రజలను మనం చూస్తునే ఉన్నాము. అలాగే ప్రాచీన కాలం నుండి యూదులు మరియు క్రైస్తవులు కూడా చేతబడి ప్రభావం ఉంటుందని విశ్వసిస్తారు. మరియు వారి గ్రంథాలలో కూడా చేతబడి వాస్తవాన్ని తెలియజేయడం జరిగింది. అలాగే ముస్లిములు కూడా చేతబడి వాస్తవాన్ని ధృవీకరిస్తారు. ప్రజలపై దాని ప్రభావం ఉంటుందని కూడా నమ్మతారు. అంతే కాకుండా దాని కారణంగా అనారోగ్యాలకు, బాధలకు గురికాబడి కొన్ని సార్లు చనిపోయే సంఘటనలు కూడా జరుగుతాయి. దాని గురించి ఖుర్ఆన్‌లో కూడా ప్రస్తావన వచ్చింది. మరియు చేతబడి విద్యను నేర్చుకునేవారు ఒక ఘోరమైన పాపంలో పడినట్లేననీ భావించడం జరిగింది. చేతబడి ముఖ్య ఉద్దేశాలలో ఆలుమగలు కట్టుకున్న అనురాగ గోపురాల్లో కలతలు రేపి, అనుమానాల బీజాలు నాటి, వాళ్ళ సంసారాల్లో నిప్పులు

పోయాలనీ, కాపురాలను కూల్చాలనీ వారు తహతహలాడుతారు. అంటే; అది వారి వారి అధోగతికి పాలౌవటానికీ ఒక నిదర్శనం, కొంపలు కూల్చే వారి కార్యక్రమంలో ఒక ముఖ్యాంశం అన్నమాట.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు: **‘‘కానీ నిశ్చయంగా షైతానులు సత్యాన్ని తిరస్కరించారు. వారు బాబీలోన్ నగరమందు, హారూత్, మారూత్ అనే ఇద్దరు దైవదూతల ద్వారా తేబడిన జాలవిద్యను ప్రజలకు నేర్పుచుండిరి. ఎవరికైనా ఆ విద్యను నేర్పేటప్పుడు, వారిద్దరు (దేవదూతలు) ఇలా చెప్పేవారు: ‘‘నిశ్చయంగా, మేము (మానవులకు) ఒక పరీక్ష! కాబట్టి మీరు (ఈ జాలవిధ్యను నెర్చుకొని) సత్య తిరస్కారులు కాకండి.’’ అయినప్పటికీ వారు (ప్రజలు), భార్యా భర్తలకు ఎడబాటు కలిగించే (జాలవిద్య) వారిద్దరి దగ్గర నేర్చుకునేవారు. మరియు అల్లాహ్ అనుమతి లేనిదే, దానిద్వారా ఎవరికీ ఏ మాత్రం హాని కలిగించలేరు. మరియు వారు నేర్చుకునేది, వారికి నష్టం కలిగించేదే. కాని లాభం కలిగించేది ఎంత మాత్రం కాదు. మరియు వాస్తవానికి దానిని (జాలవిద్యను) స్వీకరించేవానికి పరలోక సౌఖ్యాలలో ఏమాత్రం భాగం లేదని వారికి బాగా తెలుసు. మరియు వారు ఎంత తుచ్ఛమైన సొమ్ముకు బదులుగా తమనుతాము అమ్ముకున్నారు! ఇది వారికి తెలిస్తే ఎంత బాగుండేది.’’** (సూరతుల్ బఖరా:102)

మూసా (అలైహిస్సలాం) కాలంలో జాలవిద్య మంచి ఊపుమీద ఉండేది. మరియు మూసా (అలైహిస్సలాం) గారి మహిమలను చూసి ఫిరౌన్ జాలవిద్యనేని తలపోసి, మాంత్రిక విద్యలో ఆరితేరిన వారిని సమీకరించాడు. ఆ విషయాన్ని అల్లాహ్ ఇలా తెలియజేసాడు: **‘‘వారు నిపుణులైన**

**మాంత్రికులందరిని తీసుకువస్తారు. ఆ విధంగా మాంత్రికులు ఫిరౌను వద్దకు వచ్చారు, ''మేము గనక గెలిస్తే మాకేదైనా పారితోషికం లభిస్తుందా?'' అని విన్నవించుకున్నారు. – ''ఔను, అంతే కాదు, మీరు నా సన్నిహితుల్లో చేరుతారు''** అని ఫిరౌను అన్నాడు.

(సూరతుల్ బఖరా:112-114)

కనుక ఈ ప్రపంచంలో చేతబడి అన్నది వాస్తవం. అది తిరస్కరించలేని ఒక నగ్న సత్యం. ఆ విద్యను నేర్చుకోవడం ఇస్లామీయ ధర్మ ప్రకారం ఘోరమైన పాపం. ఎవరైనా ఆ విద్యను నేర్చుకొని చేతబడి చేస్తే అవిశ్వాసంలో పడినట్లే.

మాంత్రికులు మరియు ఇంద్రజాలికలు షైతానులకు బానిసలు. వారికి అనుగుణంగా కొన్ని సాహసాలు చేసి అవసరమైతే షైతానులు కోరిన వస్తువులను సమర్పించి పూజలు నిర్వహిస్తారు. మరియు షైతానుల మెప్పు పొందుటకై పశువులను, మనుషులను కూడా బలిచేయుటకు వెనకాడరు. అలా షైతానుల సహాయంతో ప్రజలను అనేక సమస్యలకు గురిచేస్తారు.

అల్లాహ్ చిత్తమైతే తప్ప చేతబడి ఎవరిని నష్టం చేకూర్చదు. అల్లాహ్ ఆదేశం మరియు అనుమతితోనే దాని ప్రభావం ఉంటుంది. ఎందుకంటే ఈ సకల లోకాలలో ప్రతి వస్తువు అల్లాహ్ శక్తికి లోబడి ఉన్నాయి. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై చేతబడి జరిగింది. కాని అల్లాహ్ ఆయనకు దాని హాని నుండి రక్షించాడు. ఆయనపై చేతబడి కొరకు వాడబడిన వస్తువులను కనుగొని దాని ప్రభావాన్ని తొలగించడం జరిగింది. ఆ తరువాత అల్లాహ్ ఆయనకు స్వస్థను ప్రసాదించాడు. ఖుర్ఆన్ గ్రంథంలో ఉన్న చివరి రెండు సూరాలు మరియు వాటి వాఖ్యానం అధ్యాయనం చేయండి.